# పరిహారంలో వివక్ష..

- న్యాయం వికాస్‌కేనా..?
- నరసయ్యకు ఏమిటి ఈ అన్యాయం..?
- జాతీయ సంఘాల వైఖరిపై కార్మికుల అసంతృప్తి..
- నాయకుల పోరాటం ఒకరికి మాత్రమేనా..?
- న్యాయం మాటల్లో కాదు.. చర్యల్లో చూపాలి..?





**శెనార్తి మీడియా, మంచిర్యాల**

సింగరేణి సంస్థ పరిధిలో కార్మికుల ప్రాణాలకు విలువ ప్రాంతాన్ని బట్టి నిర్ణయమవుతుందా? అనే ప్రశ్న స్థానికంగా తీవ్ర చర్చకు దారి తీసింది. ఇటీవల రామగుండం ఆర్జీ వన్ ఓసీపీ-5లో విధి నిర్వహణలో వికాస్ అనే కాంట్రాక్ట్ కార్మికుడు ప్రమాదవశాత్తూ ప్రాణాలు కోల్పోయిన ఘటనలో అతని కుటుంబానికి రూ.42 లక్షల పరిహారం మంజూరు కావడం, కుటుంబ సభ్యుల్లో ఒకరికి ఉద్యోగం కల్పించేందుకు సింగరేణి యాజమాన్యం అంగీకరించిన సంగతి తెలిసిందే. ఈ పరిణామంలో కార్మిక సంఘాలు తమ విజయంగా ప్రకటించుకున్నాయి. ఇదే సమయంలో బెల్లంపల్లి ఏరియాలో గోలేటి 1 ఇంక్లైన్ వద్ద మంగళవారం చోటు చేసుకున్న తేనెటీగల దాడిలో మృతి చెందిన మరో కాంట్రాక్ట్ కార్మికుడు పుప్పాల నరసయ్య కుటుంబానికి మాత్రం కేవలం రూ.3 లక్షల పరిహారమే మంజూరు చేయడం తీవ్ర విమర్శలకు దారితీస్తోంది. ఇద్దరూ కాంట్రాక్ట్ కార్మికులే. ఇద్దరూ సంస్థ కోసం ప్రాణాలు అర్పించినవారే. అయినా ఒకరికి రూ.42 లక్షలు, మరొకరికి రూ.3 లక్షలు మాత్రమే అందించడం సింగరేణి యాజమాన్యం, కార్మిక సంఘాల ద్వంద్వ ధోరణిని బయటపెడుతోంది.రామగుండంలో నిష్కర్షణ పనులు నిర్వహిస్తున్న పీస్ పటేల్ కంపెనీకి చెందిన వికాస్, బెల్లంపల్లిలో సివిల్ పనులు నిర్వహిస్తున్న పైడి రాజు కంపెనీకి చెందిన నరసయ్య ఇద్దరూ ఒక్కటే స్థాయిలో పని చేసినా పరిహారంలో వచ్చిన తేడా కార్మికుల ఆగ్రహానికి దారితీసింది. వికాస్ మృతిపై జాతీయ స్థాయి కార్మిక సంఘాల నేతలు రంగంలోకి దిగి పోరాటం జరిపి భారీ పరిహారం సాధించగా, నరసయ్య ఘటనపై మాత్రం వారికి కనీస స్పందన కూడ లేకపోవడం మానవత్వాన్ని మసకబార్చే విధంగా ఉందని పలువురు అభిప్రాయపడుతున్నారు. నరసయ్యకు భార్య లక్ష్మి , ముగ్గురు కుమార్తెలు ఉన్నారు. కుటుంబం ఇప్పుడు ఆర్థికంగా పూర్తిగా చెరుకుపోయిన పరిస్థితిలో ఉంది. వారి పరిస్థితిని బట్టి చూస్తే, కనీసం వికాస్‌కు అందించిన తరహాలోనే నష్టపరిహారం ఇవ్వడం కర్మసమ్మతం మాత్రమే కాదు, మానవతా దృక్పథాన్ని ప్రతిబింబించే పని. అయితే కార్మిక సంఘాలు ఈ విషయంలో ఎందుకు మౌనం వహిస్తున్నాయో చెప్పలేని మౌనమే సమాధానంగా మారుతోంది. ఒకే సంస్థలో, ఒకే విధంగా పని చేసి ప్రాణాలు కోల్పోయిన ఇద్దరు కార్మికుల పరిహారాల్లో ఈ స్థాయి తేడా చోటుచేసుకోవడం సింగరేణి వంటి సంస్థలో సమానత్వంపై బహిరంగ ప్రశ్నలు వేస్తోంది. రామగుండం ప్రమాదానికి స్పందించిన నాయకులు, బెల్లంపల్లి ఘటనపై ఎందుకు ముందుకు రాలేదు..? నరసయ్య కుటుంబాన్ని పరామర్శించడంలో కూడా మౌనంగా వ్యవహరించడం బాధిత కుటుంబాన్ని మరింత గాయపరుస్తోంది. ఇప్పటికైనా జాతీయ కార్మిక సంఘాల నేతలు న్యాయంగా స్పందించాలని కార్మికులు డిమాండ్ చేస్తున్నారు. పరిహారంలో సమానత్వాన్ని పాటించి, నరసయ్య కుటుంబానికి కూడా వికాస్ కుటుంబానికి ఇచ్చిన విధంగా పూర్తి న్యాయం చేయాలని కోరుతున్నారు. ప్రాణానికి విలువ ఒక్కటే. ప్రాంతం మారినా... విధి మారినా... మనిషి విలువ మారకూడదని కార్మికులు స్పష్టంగా హెచ్చరిస్తున్నారు.



## బెల్లంపల్లి మున్సిపల్ పరిధిలో నూతన బార్

- జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్




**శెనార్తి మీడియా, మంచిర్యాల**

జిల్లాలోని బెల్లంపల్లి మున్సిపల్ పరిధిలో గతంలో మూతబడిన బార్ స్థానంలో నూతన బార్ ఏర్పాటుకు నిర్వహించిన డ్రా పద్ధతిలో ఎంపికైన లబ్దిదారుడికి అనుమతి జారీ చేయడం జరిగిందని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. మంగళవారం జిల్లాలోని నస్పూర్లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సముదాయంలోని కలెక్టర్ సమావేశ మందిరంలో ఆబ్కారీ శాఖ పర్యవేక్షకుడు నందగోపాల్, ఎక్సైజ్ సి.ఐ. గురువయ్యలతో కలిసి డ్రా పద్దతిలో లబ్దిదారుడిని ఎంపిక చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ బెల్లంపల్లి మున్సిపల్ పరిధిలో గతంలో మూతబడిన బార్ స్థానంలో నూతన బార్ ఏర్పాటుకు నిర్వహించిన డ్రాలో గంద్ర దీక్షితైవు లబ్దిదారుడిగా ఎంపిక కావడం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు, దరఖాస్తుదారులు తదితరులు పాల్గొన్నారు.

## కష్టకాలంలో పార్టీ అండగా నిలుస్తుంది

- డాక్టర్ రాజా రమేష్
- దశదిన కార్యక్రమాల్లో బీఆర్ఎస్ నేతల వితరణ



**శెనార్తి మీడియా, మంచిర్యాల**

మంచిర్యాల జిల్లా చెన్నూర్ నియోజకవర్గంలోని మందమర్రి మున్సిపాలిటీ పరిధిలోని 15వ వార్డు అధ్యక్షుడు విరుగురాల గిరి కుటుంబంలో, 17వ వార్డు మహిళా ఇన్‌చార్జ్ అమృతక్క నాన్న మలంపల్లి మల్లయ్య దశదిన కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నేత డాక్టర్ రాజా రమేష్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన రెండు కుటుంబాలకు ఆర్థిక సహాయం అందజేశారు. మృతుల కుటుంబాలను పరామర్శించిన ఆయన వారికి రూ.16,000 నగదు, 50 కేజీల బియ్యం, 6 లీటర్ల ఆయిల్, 4 కేజీల కంది పప్పు అందజేశారు. బీఆర్ఎస్ పార్టీతో పాటు టిబిజికెఎస్ నాయకులు కూడా ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. కష్టకాలంలో పార్టీ నేతలు బాధిత కుటుంబాల పక్షాన నిలవడం తమ సామాజిక బాధ్యతగా భావిస్తున్నామని, ఎప్పటికప్పుడు అండగా ఉంటామని డాక్టర్ రాజా రమేష్ హామీ ఇచ్చారు. ప్రజల బాధల్లో పాలుపంచుకునే బాధ్యతను పార్టీ తప్పనిసరిగా తీసుకుంటుందని పేర్కొన్నారు. ఈ సందర్భంగా కుటుంబ సభ్యులు బీఆర్ఎస్ నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు.



## గోలేటిలో తేనెటీగల దాడి కలకలం

- కాంట్రాక్ట్ కార్మికుడు మృతి, ముగ్గురికి గాయాలు

**శెనార్తి మీడియా, మంచిర్యాల**



మంచిర్యాల జిల్లా గోలేటి 1 ఇంక్లైన్ వద్ద మంగళవారం చోటు చేసుకున్న తేనెటీగల దాడి ఒక ప్రాణాన్ని బలితీసుకుంది. మాదారం ప్రాంతానికి చెందిన పుప్పాల నరసయ్య (55) గోడ నిర్మాణ పనుల్లో పాల్గొనగా, అతనితో పాటు ముగ్గురు కార్మికులపై తేనెటీగలు దాడి చేశాయి. ఈ ఘటనలో నరసయ్య తీవ్రంగా గాయపడ్డాడు. మొదట గోలేటి ఆసుపత్రికి తరలించినప్పటికీ పరిస్థితి విషమించడంతో బెల్లంపల్లి ఏరియా ఆసుపత్రికి తీసుకెళ్లారు. అక్కడ వైద్యులు అతను అప్పటికే మృతిచెందినట్లు ధృవీకరించారు. మృతునికి భార్య లక్ష్మి , ముగ్గురు కుమార్తెలు సంధ్యారాణి, సౌందర్య, స్రవంతి ఉన్నారు. మిగిలిన గాయపడిన కార్మికులు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. ఈ ఘటన స్థానికంగా తీవ్ర కలకలం రేపింది. జాతీయ సురక్షిత పనివ్యవస్థలపై మరింత శ్రద్ధ అవసరమన్న చర్చ నెలకొంది.

## కుక్కల దాడిలో జింక మృతి

**శెనార్తి మీడియా, మంచిర్యాల**

మంచిర్యాల జిల్లా బెల్లంపల్లి పట్టణంలోని 2 ఇంక్లైన్ బస్తీ వద్ద మంగళవారం ఉదయం విషాద ఘటన చోటుచేసుకుంది. గోల్ బంగ్లా స్మశాన వాటిక సమీపంలో ఓ రెండు సంవత్సరాల చుక్కల జింక పిల్లపై కుక్కలు దాడి చేశాయి. తీవ్ర గాయాలతో బాధపడిన జింక పిల్ల అక్కడికక్కడే మృతి చెందింది. స్థానికుల సమాచారం మేరకు, ఐటీడీఏ తోట ప్రాంతం నుంచి తరచూ జింకలు ఆ వైపు సంచరిస్తుంటాయి. ఈ క్రమంలో స్మశానానికి సమీపంగా వచ్చిన జింక పిల్ల కుక్కల వేటకు బలైంది. అడవిలో నివసించే ప్రాణులు పట్టణాల్లోకి రావడంపై స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. సంబంధిత అధికారులు ఈ అంశాన్ని తీవ్రంగా పరిగణించి చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

## కోల్ ఇండియా డ్రెస్ కోడ్‌కి రూ.12,500 ఆమోదం

**శెనార్తి మీడియా, మంచిర్యాల**



కోల్ ఇండియా అపెక్స్ జెసీసీ సమావేశం మంగళవారం న్యూఢిల్లీలో జరిగింది. ఉద్యోగుల డ్రెస్ కోడ్ కోసం రూ.12,500 మంజూరు చేయాలని నిర్ణయించారు. సమావేశంలో చైర్మన్ పీఎం ప్రసాద్, డైరెక్టర్ (హ్యూమన్ రిసోర్సెస్) వినయ్ రంజన్ పాల్గొన్నారు. యూనియన్ నేతలు నాథులాల్ పాండే ( హెచ్ఎంఎస్), రామేంద్ర కుమార్ (ఏఐటీయూసీ), రామానందన్ (సీఐటీయూ), లక్ష్మారెడ్డి (BMS) హాజరయ్యారు. ఈ అగ్రిమెంట్‌ను సింగరేణిలో కూడా అమలు చేయాలని మందా నరసింహారావు డిమాండ్ చేశారు.

## పక్షవాత వ్యాధిగ్రాస్థునికి ఆర్థిక సహాయం

**శెనార్తి మీడియా, ఉట్నూర్**

ఉట్నూర్ మండల కేంద్రంలోని సేవాదాస్ నగర్ కాలనికి చెందిన ముస్లే మాణిక్ గత కొంతకాలంగా పక్షవాతంతో బాధపడుతున్నారు. విషయం తెలుసుకున్న వెడ్మ ఫౌండేషన్ వ్యవస్థాపకులు, ఖానాపూర్ నియోజకవర్గ శాసనసభ్యులు వెడ్మ బొజ్జు పటేల్ గారు తనవంతుగా 10వేల రూపాయల ఆర్థిక సహాయాన్ని అందించారు.ఈ కార్యక్రమంలో వెడ్మ ఫౌండేషన్ వైస్ చైర్మన్ కోరెంగ అక్షయ్ తదితరులు ఉన్నారు.

# అభివృద్ధి పనులకు శ్రీకారం

- కన్నెపల్లిలో ఎమ్మెల్యే వినోద్ పర్యటన

**శెనార్తి మీడియా, మంచిర్యాల**



మంచిర్యాల జిల్లా బెల్లంపల్లి ఎమ్మెల్యే గడ్డం వినోద్ వెంకటస్వామి మంగళవారం కన్నెపల్లి మండలంలో సుడిగాలి పర్యటన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన పలు అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలకు భూమిపూజలు చేసి, ప్రారంభోత్సవాలు నిర్వహించారు.సూర్జాపూర్ గ్రామపంచాయతీలో రూ. కోటి 20 లక్షల ఖర్చుతో నిర్మితమైన బీటీ రోడ్డును ఎమ్మెల్యే ప్రారంభించారు. అనంతరం జన్కపూర్ గ్రామంలోని ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించి రైతులతో ముఖాముఖి చర్చ నిర్వహించారు. అలాగే ఎల్లారం గ్రామంలో రూ. కోటి 60 లక్షల వ్యయంతో నిర్మించిన మరో బీటీ రోడ్డును ప్రారంభించారు. ఈ కార్యక్రమాల్లో గ్రామస్థులతో కలసి సన్నబియ్యం భోజనంలో పాలుపంచుకున్నారు. కన్నెపల్లి, భీమిని మండలాలకు చెందిన కల్యాణ లక్ష్మి , షాదీ ముబారక్ లబ్ధిదారులకు మొత్తం రూ. 20 లక్షల 2,320 విలువైన చెక్కులను పంపిణీ చేశారు. ఈ పథకాల కింద 20 మంది లబ్ధిదారులకు ఆర్థిక సాయాన్ని అందజేశారు. ఈ సందర్భంగా కన్నెపల్లి మండల మాజీ జెడ్పిటీసీ సత్తన్న కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఎమ్మెల్యే గడ్డం వినోద్ వెంకటస్వామి తన చేతుల మీదుగా పార్టీ కండువా కప్పి అతనిని పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ మాజీ వైస్ చైర్మన్ మాధవరపు నర్సింగరావు, రెవెన్యూ, మండల అధికారులు, కాంగ్రెస్ పార్టీ నేతలు, కార్యకర్తలు, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు. అభివృద్ధి కార్యక్రమాలను ప్రజల్లో హర్షాతిరేకాలు వ్యక్తమయ్యాయి.

# కాంగ్రెస్‌లో ఇంటికో వారసున్ని సైనికుల్లా పంపాలి

- జంగా రాఘవరెడ్డి
- రాజ్యాంగ పరిరక్షణ కోసం "జై బాబు జై భీమ్ జై సంవిధాన్"



**శెనార్తి మీడియా, మంచిర్యాల**

కాంగ్రెస్ పెద్దలు, ప్రభుత్వం రాజ్యాంగ పరిరక్షణ కోసమే జై బాబు జై భీమ్ జై సంవిధాన్ కార్యక్రమం చేపట్టిందని టీపీసీసీ రాష్ట్ర పరిశీలకుడు జంగా రాఘవరెడ్డి అన్నారు. బెల్లంపల్లి సోమగూడెం టోల్గేట్ దగ్గర త్రినేత్ర ఫంక్షన్ హాల్లో జై బాబు జై భీమ్ జై సంవిధాన్ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా రాష్ట్ర ఆయిల్ ఫామ్ కార్పొరేషన్ చైర్మన్, మంచిర్యాల జిల్లా కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జ్ జంగా రాఘవరెడ్డి హాజరై కార్యకర్తలను ఉద్దేశించి మాట్లాడారు. ఇంటికో వారసున్ని కాంగ్రెస్ లోకి సైనికులా పంపించాలనీ పిలుపునిచ్చారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలో లేనప్పుడు పార్టీ జెండా మోసి పార్టీకి సేవ చేసిన వారికి మాత్రమే పదవులు దక్కుతాయని తేల్చి చెప్పారు. జై బాబు జై భీమ్ జై సంవిధాన్ కార్యక్రమం ఏఐసీసీ పెద్దలు సోనియా గాంధీ, ఏఐసిసి అధ్యక్షులు మల్లికార్జున్ రాహుల్ గాంధీ ఎఐసిసి అగ్ర నేతలు ఈ గొప్ప కార్యక్రమాన్ని చేపట్టారన్నారు. ప్రతి రాష్ట్రంలో అమలు చేయాలని ఆదేశాలు ఇవ్వడంతో మన రాష్ట్రంలోని ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి,పిసిసి అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్ ఆదేశాలto నిర్వహిస్తున్నామన్నారు. దేశాన్ని ప్రస్తుతం పాలిస్తున్న జాతీయ పార్టీలు భారత రాజ్యాంగాన్ని మార్చే దిశగా అడుగులకి అడ్డుపడాలన్నారు. ఈ ఉద్దేశంతోనే డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ రచించిన రాజ్యాంగాన్ని ప్రతి గడపగడపకు తెలియజేయడం ప్రధాన ఉద్దేశం అన్నారు. రాజ్యాంగం ద్వారా మనం పొందుతున్న హక్కులను సమాజంలో ప్రతి గడప గడపకు తెలియజేయాలన్నారు. గాంధీ కుటుంబం కాంగ్రెస్ పార్టీ దేశానికి చేసిన త్యాగాలతో ఇంత స్వేచ్ఛగా జీవిస్తున్నామన్నారు. కాంగ్రెస్ పార్టీ పోరాటం చేసి మనకు స్వాతంత్రం తీసుకొచ్చిందని వివరించారు. స్వేచ్ఛగా ప్రజలు బ్రతకడానికి గాంధీ కుటుంబం దేశం కోసం ప్రాణాలర్పించిన చరిత్ర ను మర్చిపోవద్దన్నారు. ఆనాడు స్వాతంత్రం తీసుకొచ్చింది, నాడు కాంగ్రెస్ పార్టీ తెలంగాణ ఇచ్చిందనీ పేర్కొన్నారు. కాంగ్రెస్ పార్టీని తెలంగాణ ప్రజలు ఎన్నడూ మర్చిపోవద్దన్నారు. ఎప్పుడూ కాంగ్రెస్ పార్టీకి రుణపడి ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో సభ అధ్యక్షులు కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు సింగతి సత్యనారాయణ, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ కారుకూరి రామచందర్, టిపిసిసి రాష్ట్ర ప్రచార కమిటీ కన్వీనర్ నాతరి స్వామి, మాజీ గ్రంథాలయ చైర్మన్ తొంగల మల్లేష్, ఏఎంసి చైర్మన్ చింతం స్వామి టిపిసిసి మెంబర్ సిహెచ్ శంకర్, జిల్లా మహిళా అధ్యక్షురాలు పేరం రజిత, టిపిసిపి సెక్రెటరీ నూకల రమేష్, నియోజకవర్గ అధికార ప్రతినిధి బత్తుల రవి తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వా ఆసుపత్రిలో డైట్ సేవలపై ఆకస్మిక తనిఖీ



**శెనార్తి మీడియా, మంచిర్యాల**

తెలంగాణ రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ కమిషనర్ ఆదేశానుసారం, డైట్ డిస్ట్రిక్ టాస్క్ ఫోర్స్ కమిటీ జిల్లా ప్రభుత్వాసుపత్రిని మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేసింది. ఈ సందర్భంగా జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ హరీష్ రాజ్ నేతృత్వంలో, ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు అందిస్తున్న ఆహార పదార్థాల నాణ్యతను పరిశీలించారు.ఆసుపత్రిలో బ్రేక్ ఫాస్ట్, మధ్యాహ్న భోజనం మెనూ ప్రకారమే అందుతున్నాయా అనే దానిపై 20 రకాల ప్రశ్నలతో రోగులను ఒక్కొక్కరిగా అడిగి వివరాలు నమోదు చేశారు. డైట్ కాంట్రాక్టర్ కృష్ణ ఆధ్వర్యంలో అందిస్తున్న ఆహార పదార్థాల తయారీ స్థలాన్ని పరిశీలించిన డాక్టర్ హరీష్ రాజ్, శుభ్రత, నాణ్యతపై అనేక సూచనలు చేశారు. వంటకు ఉపయోగించే నీటి స్వచ్ఛత, కూరగాయల నాణ్యత, ఆహారం వండే వ్యక్తుల వ్యక్తిగత పరిశుభ్రత, ప్లేట్ల శుభ్రతపై ప్రత్యేక దృష్టి పెట్టాలని ఆదేశించారు. ఆసుపత్రి సూపరింటెండెంట్ ద్వారా ఓ ఆరెమోకు బాధ్యతలు అప్పగించాలని, వారానికి ఒకసారి డైట్ సెక్షన్ ను సమీక్షించాలన్నారు. ఈ తనిఖీలో డాక్టర్ భీష్మ, డాక్టర్ ప్రసాద్, డాక్టర్ బాలాజీ, లింగారెడ్డి, బుక్క వెంకటేశ్వర్ (జిల్లా మాస్ మీడియా అధికారి) పాల్గొన్నారు.